ప్రజా సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేతో న్యూ శ్రీనగర్ కాలనీవాసులు

మల్కాజిగిరి: న్యూ శ్రీనగర్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఇండస్ట్రియల్ ఏరియాలోని కొన్ని పరిశ్రమలు కెమికల్ వ్యర్థాలను నాలాలో వదులుతున్నారని దీనివల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. నాలా డైవర్షన్ చేసేందుకు త్వరలోనే ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కాలుష్య నివారణ బోర్డు అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే నిబంధనలు పాటించని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కార్పొరేటర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: బీజేఆర్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. కాలనీలో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. వర్షం పడినప్పుడు డ్రైనేజీ ఓవర్‌ఫ్లో అవుతుందని, దానితో పాటు తాగునీరు కూడా కలుషితమవుతుందని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. యూజీడీతో పాటు రోడ్లు దెబ్బతిన్నాయని వాటి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్పొరేటర్ సూచించారు. ఏఈ దీపక్, మేనేజర్ నవీన్, వీఐ రజనీకాంత్, బాబు, సంతోష్, సత్యనారాయణ, కిషోర్, జంగ రాజు, రంగమ్మ, డప్పు సాయి తదితరులు పాల్గొన్నారు.



నిండుకుండలా మేడ్చల్ పెద్ద చెరువు



నీటితో నిండిన తుమ్మ చెరువు

మేడ్చల్‌కు జలకళ

- మంగళ, బుధవారాల్లో కురిసిన భారీ వర్షం
- పలు ప్రాంతాల్లో పోటెత్తుతున్న వరద
- పొంగి పొర్లుతున్న చెరువులు, కుంటలు
- వరద ధాటికి గుంతలుగా మారిన రోడ్లు
- సహాయక చర్యలు చేపట్టిన యంత్రాంగం



అండర్‌పాస్ వద్ద నిలిచిన వాహనాలు



ప్రమాదకరంగా అండర్ పాస్ బ్రిడ్జి పక్కనే ఉన్న భవనం



కాలువలా మారిన నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జి

మేడ్చల్: మేడ్చల్ పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో మంగళవారం రాత్రి మొదలుకొని బుధవారం ఉదయం వరకు వర్షం దంచికొట్టింది. ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షంతో మేడ్చల్‌కు జలకళ సంతరించుకుంది. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి రెండు మూడు రోజులుగా కురిసిన వర్షమే పెద్దది కావడంతో మేడ్చల్‌వాసులకు అసలు వానా కాలం కనబడింది. మంగళవారం రాత్రి నుంచి కురిసన భారీ వర్షం నేపథ్యంలో బుధవారం తెల్లారేసరికి చెరువులు, కుంటల్లోకి వరద పోటెత్తి పొంగిపొర్లాయి. మేడ్చల్ చెరువులోకి నీటిని తీసుకొచ్చే గౌడవెల్లి, గిర్మాపూర్ వాగులు ఉధృతంగా ప్రవహించాయి.

- మేడ్చల్ పట్టణంలో భారీ వర్షాలతో కాలనీలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు ఎక్కడికక్కడ పొంగిపొర్లాయి. ఆర్టీసీ కాలనీ, వినాయక్‌నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, రాఘవేంద్రనగర్, మార్కెట్ రోడ్డు ఇలా ఎక్కడ చూసినా వరద నీరు కనిపించింది.
- మేడ్చల్ రైల్వే స్టేషన్ సమీపంలోని అండర్ పాస్‌లోకి పూర్తిగా నీరు రావడంతో చాలా కాలనీలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మాణంలో ఉన్న అండర్‌పాస్ బ్రిడ్జిలోకి నీరు చేరి కాలువను తలపిస్తుంది. అండర్‌పాస్ బ్రిడ్జి పక్కనే ఉన్న ఇంటి మట్టి కొట్టుకపోవడంతో ఇల్లు ఏ క్షణంలోనైనా కూలే ప్రమాదంలో పడింది.
- మేడ్చల్ పెద్ద చెరువు, తుమ్మ చెరువు, వివిధ గ్రామాల చెరువులు నీటితో నిండాయి. మరొక రోజు వర్షం కురిస్తే చెరువులన్ని పొంగే స్థితికి చేరాయి. భారీ వర్షాలతో అప్రమత్తమైన అధికారులు నీరు ఇళ్లలోకి చేరకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కమిషనర్ నాగిరెడ్డి, చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి వరద ప్రభావిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి అవసరమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు.

రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటే మెరుగైన పరిష్కారం

నూతన రెవెన్యూ చట్టంపై చర్చా వేదికలో నిపుణులు



సమావేశంలో పాల్గొన్న ఉప్పల్ రెవెన్యూ అసోసియేట్స్ నిపుణులు

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన రెవెన్యూ హక్కుల చట్టం - 2024 పై బుధవారం ఉప్పల్‌లోని రెవెన్యూ అసోసియేట్స్ ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహించారు. ఈ చర్చలో నూతన చట్టానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. విశ్రాంత స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు డా. రాజారాం, వెంకటయ్య, వి. అశోక్, కె.రాజేందర్‌లు కూలంకషంగా చర్చించి ఓ నిర్ణయానికి వచ్చారు. ప్రజలకు మరింత సౌలభ్యం కోసం చట్టంలో మరిన్ని మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రికార్డు ఆఫ్ రైట్స్ బిల్-2024కు బదులుగా రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ లాండ్-2024 గా ఉంటే బాగుంటుందన్నారు. అసైన్డ్ పోర్టల్ పేరు భూ- మాత, లేదా భూ భారతి అని ఉండేలా పరిశీలించాలని సూచించారు. భూ సమస్యలపై జిల్లా స్థాయిలో రెవెన్యూ ట్రిబునల్ ఏర్పాటు చేయాలని, కలెక్టర్ తర్వాత నేరుగా ట్రిబునల్‌కు అధికారులు ఉండేలా చూడాలని కోరారు. నిర్ణీత గడువు తప్పనిసరిగా విధించాలని, అప్పీల్‌కు 90 రోజులలోపు, అప్పీలు చేసిన తర్వాత అధికారులకు 90 నుంచి 120 రోజులు పరిష్కారానికి అవకాశం కల్పించేలా ఉండాలన్నారు. రికార్డ్స్ ఎంట్రీకి సంబంధించి సివిల్ కోర్టుకు ఇచ్చిన అధికారాలను తొలగించి ట్రిబునల్‌కు అధికారాలు ఇవ్వాలన్నారు. బాలరాజు, రాపోలు రాములు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి సప్తదశ వార్షికోత్సవం



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ రైల్వేగేట్ సమీపంలో ఉన్న శ్రీదుర్గా భవానీ ఆలయంలో శ్రీదుర్గా భవానీ మందిర్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సప్తదశ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి చండీహోమం, అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పేరుకే పెద్దాసుపత్రి !

– రోగులకు మందుల కొరత



జిల్లా కేంద్ర ఆసుపత్రి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రి(ఏరియా ఆస్పత్రి)లో మందుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు, సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. రోజుకు వందల సంఖ్యలో రోగులు చికిత్స, మందుల కోసం వస్తుంటారు. ఆస్పత్రి నుంచి రోగులకు అందించడానికి మందుల కోసం ఇండెంట్ పంపినా టీఎస్ఎంఎస్ఐడీసీ జాప్యం చేయడంతో రోగులకు మందులు అందడం లేదు. జిల్లా ఆస్పత్రిలో మందులు అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితి రోగులకు తలెత్తుతోంది. దూర ప్రాంతాల నుంచే వచ్చే రోగులకు మరింత ఆర్థిక భారంగా తయారైంది. సమాధానం చెప్పడంలో సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి రోగులకు సరిపడే మందులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం



అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నాచారం డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ శాంతిసాయిజెనోఖర్‌తో కలిసి లోతట్టు కాలనీలను పర్యటించారు. మ్యాన్‌హోల్‌లో మట్టి చెత్త ఉండటంతో వరదనీరు సాఫీగా వెళ్లకపోవడంతో భారీ వర్షానికి కాలనీలు జలమయమయ్యాయి. ఎమ్మెల్యే స్వయంగా పలు మ్యాన్‌హోళ్లను తెరిచి చూసేసారికి మ్యాన్‌హోల్స్‌లో మట్టికి పేరుకుపోయి కనిపించడంతో ఆయన అధికారులను నిలదీశారు. ట్రంక్‌లైన్‌లో కుడా సిల్ట్ తొలగించడంలేదని ఎమ్మెల్యేతో కార్పొరేటర్ చెప్పడంతో ఎస్టీపీ ఇంజినీరింగ్, జలమండలి అధికారులు సమన్వయంతో సిల్ట్ తొలగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మరోవారం రోజుల తరువాత మళ్లీ పనులను పరిశీలస్తానని ఎమ్మెల్యే చెప్పారు. కాప్రా డిప్యూటీ కమిషనర్ ముకుందరెడ్డి, జలమండలి జీఎం సంతోష్, డీజీఎం సతీష్, ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ స్రవంతి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్, ఎంటమాలజీ ఏఈ రమేష్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తదితరులున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్‌లు

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి, సిటీబ్యూరో: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయటానికి కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల కోసం జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో, ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో కూడా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి సందేహాలున్నా ఆయా హెల్ప్ డెస్క్‌లలో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు అవసరమైన మేరకు డాక్యుమెంట్లు ఇవ్వని పక్షంలో ఇప్పుడు తీసుకుని ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

24న మెగా లోక్‌అదాలత్

మేడ్చల్: మేడ్చల్ న్యాయస్థానం ఆవరణలో ఈ నెల 24వ తేదీన మెగా లోక్ అదాలత్‌ను న్యాయస్థానం నిర్వహించనున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హనుమాన్‌గౌడ్ తెలిపారు. స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, లైసెన్సులు లేని డ్రైవింగ్ వంటి కేసులు పెండింగ్ ఉన్న వారు అదాలత్‌కు వెళ్లి కేసులు పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఒరిజనల్ లైసెన్సు, అధార్ కార్డులతో ట్రాఫిక్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

గంజాయి తరలిస్తున్న ముఠా అరెస్ట్

జవహర్‌నగర్: గంజాయి తరలిస్తున్న అంతరాష్ట్ర ముఠాను ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్న సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌వోటీ సీఐ జానయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సాకి చెందిన సర్కార్, విశ్వాస్, సర్ధార్, సుమంత్‌ఘోష్‌లు పలు కార్లలో ఒరిస్సా నుండి గుట్టుచప్పుడు కాకుండా తీసుకువచ్చి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు జవహర్‌నగర్ గోశాల వద్ద గంజాయి తరలిస్తున్న కార్లను పట్టుకున్నారు. వారి నుంచి 10 కిలోల గంజాయి, రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, నలుగురు నింధితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ హిల్ టాప్ కాలనీలో శ్రీరేణుక ఎల్లమ్మ, పోచమ్మ తల్లి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సర్వదేవత పూజలు, దాన్యదివాస ఫలాదివాస, పుష్పాదివాస, షేయాదివాసం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లించాలి



వేం నరేందర్‌రెడ్డికి వినతిప్రతం అందజేస్తున్న పరమేశ్వర్‌రెడ్డి, బాధితులు

ఉప్పల్ : ఉప్పల్ మెయిన్‌రోడ్డులో భూములు కోల్పోయిన వారికి పూర్తి పరిహారం చెల్లించాలని కోరుతూ.. బుధవారం పలువురు బాధితులు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం భూములు లాక్కొని పరిహారం చెల్లించడంలో తీవ్ర జాప్యం చేసిందని దీనివల్ల అనేకమంది భూయజమానులు వ్యాపారాలు, భూములు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకే రకమైన ఆస్తులకు రెండు రకాల పరిహారం అందజేయడంతో తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. గజానికి రూ. 65 వేల చొప్పున నష్టపరిహారం అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్, ప్రభాకర్, తిక్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహపురి కాలనీలో నూతన ఆసుపత్రి



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీలో ఏర్పాటు చేసిన శ్రీ సత్య ల్యాప్రోస్కోపి ఆస్పత్రిని భువనగిరి మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. డాక్టర్ సుధగాని అలకనంద, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్, సుధగాని హరి శంకర్‌గౌడ్ బీఆర్‌ఎస్ నాయకుడు సాయిజెనోఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



మల్లాపూర్ : గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ ఎస్‌వీడీ లిక్కర్ ప్యాలెస్ సమీపంలో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ ఎస్వీడీ లిక్కర్ ప్యాలెస్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై 40ఏళ్లున్న వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి చెప్పారు. దీంతో నాచారం పోలీసులు వచ్చి చూసేసారికి అప్పటికే సదరు వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. దీంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ



నరేష్‌ను పరామర్శిస్తున్న కార్పొరేటర్ పన్నాల

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నేత సగరం నరేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో విషయం తెలుసుకున్న మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి నరేష్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. బీఆర్‌ఎస్ నేతలు కుంటి కృష్ణ, వాసుగౌడ్, రాపోలు సతీష్, నెమలి రవి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, మల్లేష్, ప్రకాష్, శ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి



అల్వాల్ : అల్వాల్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో ఇన్వెస్టిచర్ సెర్మనీ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కె.సదానంద్, ప్రిన్సిపాల్ కె.జ్యోతిసదానంద్‌లు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు కొనసాగాలని, దానిద్వారా లక్ష్యాలను అధిరోహించగలరని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు లక్కీశామ్యూల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపేవరకు చెత్తను సేకరించం !

ఆదర్శనగర్ డంపింగ్‌యార్డు వద్ద కార్మికులు, స్వచ్ఛ ఆటో నిర్వాహకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ ప్రతినిధులు..



గతంలో డంపింగ్‌కు కేటాయించిన స్థలం.

కుషాయిగూడ: చెత్త సేకరణను ప్రత్యామ్నాయం చూపకుండా అడ్డుకుంటే చెత్త సేకరణను నిలిపేస్తామని కాప్రా సర్కిల్ స్వచ్ఛ ఆటో టిప్పర్ యూనియన్ అధ్యక్షుడు డి. చిన్న నర్సింహ్మా స్పష్టం చేశారు. చర్లపల్లి డివిజన్ ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును ఎత్తేయాలని స్థానిక కాలనీల ప్రజలు, ఎమ్మెల్యే డిమాండ్ చేయడాన్ని నిరసిస్తూ.. బుధవారం ఆదర్శనగర్ చెత్త డంపింగ్ కేంద్రం వద్ద స్వచ్ఛ ఆటో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చిన్న నర్సింహ్మా మాట్లాడుతూ.. ఆదర్శనగర్ చెత్త డంపింగ్‌ను ఎత్తివేయాలనే ఆందోళనను తాము స్వాగతిస్తున్నామన్నారు. కానీ ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా చెత్త ఎత్తివేతను నిలిపివేయాలనే డిమాండ్ సరికాదన్నారు. మాకు ప్రత్యామ్నాయ మార్గం చూపి చెత్త డంపింగ్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెత్త డంపింగ్ చేయడానికి ప్రత్యామ్నాయమార్గాలు చూపాలని వారు కోరుతున్నారు. అప్పటి వరకు ఇంటింటి చెత్త సేకరణను నిలిపివేస్తామన్నారు. గ్రేటర్ స్వచ్ఛ టిప్పర్ చైర్మన్ సూరన్న, జ్యోతి, రాజు, గోపి, సలహాదారులు పెద్ద నర్సింహ్మా, బద్రి, వీరేష్, కోట రవి, నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నిలిచిపోయిన స్వచ్ఛ ఆటోలు

భారీ వాహనాల్లో వ్యర్థాలను డంప్ చేయడంతోనే..

కాప్రా: సాకేత్ సమీపంలో చెత్త డంపింగ్‌ను నిలిపివేయడంతో స్వచ్ఛ ఆటో నిర్వాహకులు ధర్నా చేపట్టారు. చెత్త డంపింగ్‌కు అడ్డుపడుతున్నారని బుధవారం కాప్రా సర్కిల్ పరిధిలోని స్వచ్ఛ ఆటో నిర్వాహకులు ఆందోళన చేపట్టారు. రాంకీ సంస్థకు చెందిన పెద్ద పెద్ద లారీలు కూడా ఇక్కడే చెత్తను డంప్ చేయడంతోనే సమస్య ఏర్పడిందని వారి మూలంగా తమకు కేటాయించిన స్థలాన్ని ఎత్తి వేశారని వాపోతున్నారు. కాప్రా, ఏఎస్‌రావునగర్, చర్లపల్లి డివిజన్ల నుంచి ఇంటింటికి చెత్తను సేకరించిన చెత్తను ఇక్కడి తీసుకొస్తామని, తాము తీసుకొచ్చే చెత్తతో ఎలాంటి సమస్య లేదని, రాంకీ సంస్థకు చెందిన లారీలు, పెద్ద హోటల్స్, ఇతర పరిశ్రమలకు చెందిన వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడే డంప్ చేయడంతోనే సమస్య ఉత్పన్నమైందని పేర్కొన్నారు. వాటిని నిలిపివేయకుండా స్వచ్ఛ కొత్త స్థలం కేటాయించేంత వరకు ఆటోలను నిలిపేస్తే ఇళ్లల్లో సేకరించిన చెత్తను ఎక్కడ వేయాలని ప్రశ్నిస్తున్నారు. మరో స్థలం కేటాయించే వరకు ఇక్కడే డంప్ చేసేలా అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీనిపై అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పరిష్కారం చూపండి..



గత నాలుగు రోజులుగా ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ చేయకుండా నిలిపేశారు. ఇళ్లల్లో చెత్త పేరుకుపోయిందని జనం ఫోన్లు చేస్తున్నారు. మాకు కేటాయించిన స్థలంలో డంపింగ్‌ను నిలిపివేస్తే చెత్త సేకరణకు ఎలా వెళ్లాలి..? అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న స్థలంలోనే అనుమతించాలి. దీనిపై తక్షణమే అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– కిరణ్, స్వచ్ఛ ఆటో యూనియన్ ప్రతినిధి